

# తోడొకరుండిన....

**- శారద పోలంరాజు**



*(గత సంచిక తరువాయి)*

"**కుసుమా నువ్వు ఎప్పుడు** కూడా అనాధవని అనుకోకూడదు. నీ కోసం పరితపించే నీ వాళ్ళు, నీ మంచి కోరి నీకు కావలసిన సహాయం అందించే మంచి ఫ్రెండ్స్, ఆస్తిపాస్తులు అన్ని వున్నాయి. కేవలం అమ్మ నాన్న లేనంత మాత్రాన అనాధలు కారు.

ఇప్పుడు నన్ను మీ ఆంటీని చూడు మా తల్లితండ్రులు కూడా ముసలితనంతో మరణించారు. అంటే మేము కూడా అనాధలమేనా? మనకు కావలసినది అమ్మ నాన్న మాత్రమే కాదు.

ఇంక నుండి నీ మనసులోంచి నీకు ఎవరూ లేరు అన్న భావన చెరిపేసేయి. నీకు అందరూ వున్నారు అనుకుంటూ సెల్ఫ్ కౌన్సిలింగ్ చేసుకుంటూ వుండు. మనసు ఎంత ప్రశాంతంగా వుంటుందో నీకే తెలుస్తుంది. బాగా పొద్దుపోయింది. ఇంక పడుకోండి. రేపు పొద్దున్నే లేవాలి. దుర్గాష్టమి పూజ కూడా చేసుకోవాలి. " చటుక్కున లేచి కుసుమ తల నిమిరి ఆయన వేరే మాట లేకుండా ఆయన గదిలోనుండి వెళ్ళిపోయారు.

ఆ సంఘటన తాలూకు ప్రభావం నుండి తేరుకోవటానికి కుసుమకు కొంత సమయం పట్టింది.

ఆ రాత్రి కుసుమకు ఆయన మాటలే పదేపదే గుర్తుకు రాసాగాయి.

అనుకోకుండా మరుసటి రోజునే జరిగిన సంఘటనతో కుసుమలో చాల పెద్ద మార్పే వచ్చింది.

పూజ అయిపోయిన తరువాత భోజనాలు చేసి అందరూ ఎవరి పాటికి వాళ్ళు చదువుకుంటూ కూర్చున్నారు. పక్కింటి నుండి ఏదో గొడవవుతున్నట్టుగా వుంది. నాయనమ్మ గొంతుక పెద్దగా వినిపిస్తున్నది.

ఏమిటో చూసొద్దామని లేచి వెళ్ళారు. ఈ లోపే తరుణి అమ్మ సుగుణ, నాన్న శ్రీహరి అక్కడకు చేరారు. యాది కూడా తలుపు చేర వేసి వాళ్ళ వెనకే వచ్చింది.

పన్నెండేళ్ళ అమ్మాయి హాల్లో ఒక పక్కమూలగా ముడుచుకొని కూర్చున్నది. బయట ఒక మగ మనిషి అతని వెనకాల చంకన పిల్లను ఎత్తుకొని అతని భార్య కాబోలు ఒక ఆడామె నిలబడి వున్నారు. ఇంట్లోని జనాభా అరుగుల మీద నిలబడి కొందరు, పక్కనే మొత్తన కూర్చొని కొందరూ చూస్తూ వింటూ వున్నారు.

"ఓరి దౌర్భాగ్యుడా! నిక్షేపమంటి పిల్లను ఏ స్థితికి తెచ్చారో చూడరా. పిల్ల ముండను చూస్తుంటే నాకే ఏడుపొస్తున్నది. వంటి మీద సందు లేకుండా వాతలు పెట్టారు. మీరసలు మనుష్యులేనా? దానికసలు బుద్ధి జ్ఞానమే లేదు. నీకేం పోయేకాలం వచ్చిందిరా? కన్న తండ్రివి చూస్తూ ఎట్లా వూరుకున్నావురా? పాపం ఎంకటలక్ష్మి చచ్చి ఏ లోకాన వుందో ప్రాణం పోయేదాకా దాని నోటెంబట అమ్మా, నరసి గురించే దిగులుగా వుందమ్మా అన్నది. తలుచుకుంటూ వుంటే కడుపు తరుక్కు పోతుంది. దాని బాగోగులు నేను చూసుకుంటానే అని దాని చేతిలో చేయేసాను. ఇప్పుడు చూడరా దాని ఆత్మ పైలోకాల నుండి చూస్తూ ఎంత క్షోభిస్తున్నదో ఏమో." నాయనమ్మ కళ్ళు చెమ్మగిల్లాయి.

"లేదమ్మగారూ, ఇంకో పాలి అట్లా జరక్కుండా చూసుకుంటాను." చేతులు నలుపుకుంటూ ప్రాధేయపడ్డాడు.

"ఛత్ తప్పుడు ముండాకొడకా. ఈ మాట ఎన్నిసార్లు చెప్తావురా? ఈ పాలి ఈ పాలి అంటూ అది నీ పెళ్ళాం చేతిలోనో దాని అమ్మ చేతిలోనో చచ్చేదాక అట్లాగే అంటూ వుంటావు. ఆ తర్వాత కుయ్యో మొఱ్రో పిల్ల చచ్చిందంటూ రాగాలు మొదలెడతావు. చాలు చాలు వచ్చిన దారే వెళ్ళు."

"అదేంటమ్మగారూ, ఇంట్లో పిల్లన్న తర్వాత ఒక దెబ్బ వేయకుండా వుంటారా? అంతకే యాగీ చేత్తారేటి." వెనక నిలబడ్డ ఆడమనిషి నోరు విప్పింది.

"అమ్మ అంటున్నావు ఎవరే నువ్వు? నా కూతురా? పిల్లను ఒక దెబ్బ వేసావా? మా అమ్మే ఎంత మంచి తల్లివే? పొద్దు కూకేటప్పటికి ముంతెడు కల్లు గొంతులో పోసుకొని పిల్లముండ వుడకేసి పడేస్తే పీకల దాకా మెక్కి పిల్లది తిన్నదా చచ్చిందా అని కూడా పట్టించుకోకుండా దాన్ని ఎండనకా వాననక చెట్టు కిందకు తోసి వెచ్చగా మొగుడి పక్కన తొంగునే నువ్వటే నా తల్లీ!" అచ్చంగా సినిమాలలో భానుమతి స్టైల్ లో ఆమె చేతులు తిప్పుతూ కీచు గొంతుకతో అనేటప్పటికి అంత సీరియస్ సిట్యువేషన్ లో కూడా కొంచం నవ్వు వచ్చింది.

"ఏంటమ్మగారూ, తమరు కూడా అట్టా అంటే ఎట్టా? కొట్టినా పెట్టినా అయ్య అమ్మ దగ్గరే వుండాల. అంతే కాని ఇట్టా ఇల్లొదిలొస్తే మా వోళ్ళంతా ఏమంటారు?" వెనక నుండి ఇంకొక నడి వయసు స్త్రీ ముందుకు వచ్చింది.

"ఓహోహో మందీమార్బలం అంతా వత్తాసుకు వచ్చేసారన్నమాట. ఏమే కాసులూ, కూతురు చేసిన పనికి నువ్వు వత్తాసా? అసలు దీనికంతా మూలం నువ్వుకాదుటే. ఆనాడేమో అమ్మగోరూ నా బిడ్డను నీ బిడ్డ అనుకొని ఇక ఇంటి దాన్ని చేయమ్మా అంటూ బుడి బుడి దీర్ఘాలు తీస్తుంటే వద్దు వద్దంటున్నా ఈ గోవిందు గాడికి నచ్చ చెప్పి పిల్ల ఆలనా పాలనా చూసుకుంటుందని దగ్గరుండి పెళ్ళి చేసేదాక నా గొంతు మీద కూర్చున్న మహాతల్లికేనా ఈ రోజు గొంతుక లేస్తోంది. నువ్వు మధ్యలో మాట్లాడితే పీక తెగ్గోస్తా. నోరుమూసుకుపడి వుండు. అయినా నీ కూతురు పెళ్ళి చేసి దాన్ని అత్తారింటికి పంపిన దానివి ఇంకా మళ్ళీ దాని పక్కనే ఎందుకు చేరావు? అయినా ఆ పిల్ల ముండ ఏం చేసిందని ఆ విధంగా రాచి రంపాన పెడుతున్నావు?"

"అదేంటి అమ్మగారూ, ఆడపిల్లకు పని నేర్పించటం తప్పా. రేపు పెళ్ళయిన తర్వాత పనిపాటలు రాక పోతే మమ్మల్ని అనరా. ఈ పాలికి చిట్టమ్మను మాతో పంపియ్యండి అమ్మగారూ."

"ఛత్ తప్పుడు ముండా. నోర్మూయ్. నరసి ఇక్కడే వుంటుంది. నేను దాన్ని పంపను. చావండి ఏ గంగలో దూకుతారో పోండి. కదలక పోయారో కాళ్ళు విరగ్గొట్టి వీధిలో పారేయిస్తాను ఖబడ్దార్."

"అమ్మగారూ ఒక్కపాలి నరసిని పిలవండమ్మా. దానితోనె మాటాడుతాను. తప్పయిపోయిందమ్మా. నరసిలో దాని తల్లిని చూసుకుంటున్నానమ్మా. ఇదే చివరిసారి ఇంకో మాటు ఇట్టా జరక్కుండా చూసుకుంటానని సత్తెపెమానికంగా చెబుతూండానమ్మా." పాపం ఆ తండ్రి. అటు రెండో పెళ్ళాన్ని కాదనలేడు. ఇటు కన్న కూతురిని వదులుకో లేడు. ఈ రెంటి మధ్య అడకత్తెరలో పోకలాగా నలిగిపోతున్నాడు. బిడ్డ మీద మమకారంతో దీనంగా బతిమిలాడుకుంటున్న వాడిని చూసి అందరికి జాలిగా వుంది. కాని అట్లాగే వదిలేస్తే ఆ సవతి తల్లి, దాని తల్లి చేతిలో అన్యాయంగా చస్తుంది.

నాయనమ్మకు కూడా వాడంటే కొంత సానుభూతి వుంది.

"సరే. దాన్నే పిలుస్తాను. అది వస్తానంటే అప్పటి సంగతి చూసుకుందాము." అని లోపలికి తొంగి చూస్తూ, "యాదీ, నరసిని ఇటు రమ్మనవే."

గోవిందు వూళ్ళో నాయనమ్మ వాళ్ళ పొలాలు చూసుకుంటూ వుండేవాడు. వాడికి వెంకటలక్ష్మితో పెళ్ళి అయినప్పుడే వీళ్ళు పొలాలన్ని అమ్ముకొని పట్నంలో వచ్చి స్థిరపడ్డారు. అతనికి ఒక రిక్షా కొనిపెట్టి ఇంటి ముందర ఖాళీ స్థలముంటే అక్కడ ఒక చిన్న పెంకుటిల్లు వేసి

కాపురం పెట్టించారు. వెంకటలక్ష్మి ఇంట్లో పనంతా చేస్తూ వుండేది. యాదగిరి నరసింహస్వామి దయ వల్ల పుట్టిందని పిల్లకు నరసి అని పేరు పెట్టు కొన్నారు. వాళ్ళ అన్యోన్య సంసారం చూసిన దేవుడికి కన్ను కుట్టినట్టయింది.

నరసికి అయిదేళ్ళ వయసులో ఏదో మాయరోగం వచ్చి వెంకటలక్ష్మి కన్ను మూసింది. దాని మీద అంత ప్రేమ పెంచుకున్న గోవిందు దాదాపు పిచ్చివాడై పోయినాడు. వాడికి వచ్చచెప్పి నాయనమ్మ పిల్ల కోసమంటూ రెండో పెళ్ళికి వప్పించింది. అదే ఆ పసిదాని కొంపముంచింది. సవితి తల్లికి ఒక కూతురు పుట్టేటప్పటికి ఆమె తల్లి కాసులుకు బుర్రలో పురుగు తొలవటం మొదలెట్టింది. ఆ పిల్లను నానా హింసలు పెట్టటం మొదలెట్టింది. గోవిందు పిల్లల కోసం ఎంతో కొంత వెనకేస్తూ వచ్చాడు. నరసికి ఏమీ దక్కకుండా అంతా తన మనుమరాలికే చెందాలని కూతురు మనసులో విషపు బీజం నాటింది. దాంతో ఇద్దరు గోవిందుకు కూడా నరసి మీద విరుద్ధంగా చెప్పి అతనికి కూడా కూతురు మీద మనసు విరిగేలా చేయటం మొదలెట్టారు. కాసులు కూడా వీళ్ళు వుంటున్న ఇంటి పక్కనే చేరి అందిన మటుకు వెనకేయటం మొదలెట్టింది.

ఇవన్ని చూస్తున్న నాయనమ్మ ఏమీ చేయలేకపోతున్నానే అని బాధపడేది. తాను బలవంత పెట్టకపోతే గోవిందు ఈ పెళ్ళి చేసుకునేవాడు కాదు. ఆ పసిదానికి ఈ గతి పట్టేది కాదని పదేపదే కోడళ్ళ దగ్గర వాపొయ్యేది.

పండగ రోజున ఇంటి పనంతా చేసి కాసులు చెప్పిన వంటంతా పూర్తి చేసిన నరసి అలసి పోయి కాస్సేపు పడుకుంది. అదే సమయంలో కాసులు లేపి వళ్ళు నొప్పులుగా వున్నాయి. కల్లు కంపౌండుకు పోయి ఒక ముంత తెచ్చిపెట్టి కాళ్ళు పట్టమని ఆజ్ఞ జారీ చేసింది.

"అలసిపోయి వున్నాను సాయంత్రం తెచ్చిపెడతాను" అంది నరసి.

అది కాదు కారణం. ఆవేళ్టప్పుడు పోకిరీ వెధవలు అక్కడ అడ్డా పెట్టుకొని వచ్చేపోయే వాళ్ళను అల్లరి పెడుతూ వుంటారు. వాళ్ళ చూపులు మాటలకు భయపడ్డ నరసి సాయంత్రం పోయి తెస్తానని చెప్పింది.

సాయంత్రం పెద్దవాళ్ళుకూడా వుంటారు కాబట్టి అంత భయం వుండదు. అంతే అదే కారణం దాని వళ్ళు హూనం అవటానికి.

తట్టుకోలేక నాయనమ్మ దగ్గరకు వచ్చింది. ఇంతకు ముందు కూడా రెండుసార్లు అట్లాగే వళ్ళంతా వాతలతో వచ్చినప్పుడు గోవిందును వాడి పెళ్ళాన్ని పిలిచి చివాట్లు పెట్టి పంపించింది.

కాని ఈసారి మటుకు ఆవిడ తట్టుకోలేక పోయింది. ఏడుస్తూ వచ్చిన నరసి మొహమంతా వుబ్బిపోయి వుంది. ఆ వయసు పిల్లకు వుండాల్సిన లక్షణాలే లేవు. బలహీనంగా వుంది. తిండి తిని ఎంతకాలమయిందో అన్నట్టుగా వుంది. ఆ పిల్లను కూర్చోబెట్టి ధైర్యం చెప్పి అన్నం పెట్టి, "ఇక్కడే పడుకో నీకేం భయం లేదు." అని ఒక చాప ఇచ్చింది.

అప్పటి వరకు వణికిపోతూ మూల కూర్చున్న నరసికి యాది ధైర్యం చెప్తుతూ కూర్చుంది. "భయంలేదు అందరూ వున్నారుగా పద." అంటూ లేపి చెయ్యి పట్టుకొని అందరి మధ్యలోకి తీసుకు వచ్చింది. నరసిని చూడగానే అందరికి బాధ కలిగింది.

"అదిగో చూడరా నీ కూతురు. వళ్ళంతా అంత వాతలు తేలేదాకా కొడుతుంటే చూస్తూ వూరుకోవటానికి నీకు మనసెట్లా ఒప్పిందిరా? చూడరా చూడు." అంటూ వణికి పోతూ వెనక వెనకే నక్కి వున్న నరసి చేయిపుచ్చుకొని ముందరికి లాగింది. "ఏమే నరసి మీ అయ్య నిన్ను తీసుకెళ్ళటానికి వచ్చాడు. వెళ్తావా?" అరిచినట్టే అన్నది.

ఆ పిల్ల ఇంకా వణికి పోతూ పెద్దగా ఏడుస్తూ, "వద్దు వద్దు నేనెళ్ళ. ఆళ్ళు నన్ను చంపేస్తారు." అన్నది.

"విన్నారుగా. ఇంకా నిలబడ్డారేం? వచ్చినదారినే బయలుదేరండి. ఇంక నేను దాన్ని నీ ఇంటికి పంపేది లేదు. రేపే దాన్ని బోర్డింగ్ స్కూల్లో చేర్పించబోతున్నాను. బయటకు పదండి."

"మా ఇట్టం లేకండ బల్లో ఎట్టా ఏత్తారమ్మా. దానికి పెళ్ళిచేయాలనుకుంటున్నం. అది మా ఇంటి పిల్ల. కొట్టుకుంటామో

చంపుకుంటామో. మా యిట్టం. మా కులపోల్లను పిలిపించి పంచాయితి ఎట్టి పిల్లను ఎట్టా తీసకపోవాలో మాకు బాగ తెలుసు." ఇంకా మొండిగా కాసులు వాదించబోయింది. ఆ మాటలకు కోపం వచ్చిన నాయనమ్మ చిన్న కొడుకు ముందరకు రాబోయినాడు.

అంతే అప్పటిదాకా నాయనమ్మలో వున్న ఓర్పు నశించింది. కొడుకు చేయిపట్టుకొని ఆపి, "ఏమే ముదనష్టపుదానా బెదిరిస్తున్నావా? బయటకు నడుస్తావా, కాళ్ళు విరగ్గొట్టమంటావా?"అంటూ పక్కనే వున్న చేతి కర్రను చేతిలోకి తీసుకుని వాళ్ళ ముగ్గురిని తరిమితరిమి కొట్టింది. "కులపోళ్ళను పిలిపిస్తుందంట కులపోళ్ళను. రానీయ్ చూస్తాను ఒక్కొక్కళ్ళను. బెదిరిస్తుందేం బెదిరింపు."

"నరసి! నేను, నా కుటుంబం వున్నంత కాలం నీకేం భయం లేదు. ఒరేయ్ సుందరం, ఈ సెలవలు అయిపోగానే వెళ్ళి మన బాల విహార్లో వున్న బోర్డింగ్ స్కూల్ లో చేర్చిరా దాన్ని. శుబ్బరంగా చదువుకొని దాని కాళ్ళ మీద అది నిలబడేదాకా నేనున్నా లేకపోయినా మీరు దానికి అండగా వుండాలి." ఆర్డర్ ఇచ్చినట్టే చెప్పి "పదండి ఇంక. ఎవళ్ళ పని వాళ్ళు చూసుకోండి. పోండి."

ఈ అనుభవం కుసుమకు కొంత వింతగా వుంది.

పిల్లలందరికి అన్నం కలిపి ఆప్యాయంగా ముద్దలు పెట్టే నాయనమ్మలో కొత్త మనిషిని చూస్తోంది.

అప్పుడే అర్ధమయింది. ఆడది అంటూ అందరూ చులకనగా చూసే స్త్రీ ఎంత శక్తివంతురాలో?

అన్నపూర్ణ లాగా పెట్టే చేయి అవసరం వచ్చినప్పుడు కాళికా అవతారం ఎత్తి కత్తి కూడా ఝుళిపించగలదు.

అందుకే అన్నారు ద హాండ్ దట్ రాక్స్ ద క్రేడిల్ రూల్స్ ద వర్ల్డ్. అని వుయ్యాల వూపే చేయే ప్రపంచాలను పాలించగలదు. ఆ మాట నాయనమ్మ చేసి నిరూపించింది.

అయినా ఆవిడ ఔన్నత్యం ఏమిటి? పక్క ఇంట్లో ఏమైనా మనకెందుకులే అని చూసి చూడనట్టు పోయే ఈ రోజులలో అంత ఆచారాలు పాటించే ఆవిడ ఒక రిక్షా వాడి కూతురు కోసం అంత పోరాటం చేస్తున్నది అంటే నిజంగా ఆవిడ ఔదార్యానికి చేతులెత్తి మొక్కాలనిపిస్తున్నది. దుర్గాష్టమి పర్వదినాన నిజంగానే దుర్గావతారాన్ని చూసినంత ఆనందం కలిగింది.

ఆ రాత్రి కుసుమకు ఆలోచనలతో నిద్ర కరువయింది. వీళ్ళంతా అరమరికలు లేకుండా ఈ విధంగా ఎట్లా కలిసి మెలిసి వుండగలుగుతున్నారో? వాళ్ళలాగా ఎందుకు తన వాళ్ళతో కలవలేకపోతోంది?

పాపం నాయనమ్మ పిన్ని తను చికాకు పడ్డప్పుడల్లా ఎట్లా చిన్నబుచ్చుకుంటారో గుర్తుకొచ్చింది.

తనతో మాట్లాడాలంటేనే భయపడే చెల్లెళ్ళు తమ్ముళ్ళు గుర్తుకొచ్చారు.

అనుక్షణం తన సంతోషం కోసం తాపత్రయపడే చిన్నాన్న తాతగారు గుర్తుకొచ్చారు.

తను ఎందుకు అట్లా ప్రవర్తిస్తున్నదో తనకే తెలియటం లేదు.

ఈ రెండు రోజులు రెండు కుటుంబాలలో జరిగిని సంఘటనలు అనూహ్యం.

తను ఇక్కడకు వచ్చిన మర్రోజు జరిగిన సంఘటన ఒకటి గుర్తు కొచ్చింది.

ఆరోజు జానకమ్మ హడావుడిగా వచ్చి, "ఏమబ్బాయ్ శ్రీహరి! వంట్లో పాలుమాలిక చేసిందంటనే? జ్వరమేమైనా వచ్చిందా?" నుదిటి మీద చేయేసి చూసింది. "ఒళ్ళయితే చల్లగానే వుంది."

"ఏం లేదు పిన్ని, మూడు రోజుల నుండి పని కాస్త ఎక్కువగానే వుంది. అలసట. అంతే. అంతకన్నా ఇంకేం లేదు. అయినా ఇంత హడావుడిగా ఈ సంగతి మీకు ఎవరు చెప్పారూ? పూర్ణిమేనా?"

"సరేలే నాయనా నువ్వు అన్ని అట్లాగే కొట్టి పారేస్తూంటావు. అమేన బొంగరమాలె పనులంటూ తిరుగుతూ వుంటావు. వూరందరి

కళ్ళు నీ మీదనే. ఏ పాపిష్టి కళ్ళో నీ మీద పడి వుంటాయి. లే కాస్త దిష్టి తిసి పారేస్తాను."

ఆయన వద్దంటున్నా వినకుండా లేపి వంటింట్లోకి తీసుకెళ్ళింది.

"అవతలకు పోండే. మీరంతా ఇక్కడ చోద్యం చూసేదేంటే?" తొంగి చూడబోతున్న పిల్లలతో పాటు సుగుణను కూడా ఒక్క కసురు కసిరింది.

కుసుమకు అర్థం కాలేదు. వంటగదిలో ఒక పక్కగా పెద్ద ఇత్తడి పళ్ళెంలో ఒక గిన్నె బోర్లించి వుంది. "చూసావా సుగుణా! పిల్లాడికి ఎంత దిష్టో!" అనుకుంటూ వెళ్ళిపోయింది.

అంత పెద్దాయనకు దిష్టి తీయటం ఏమిటి? బామ్మ కూడా అప్పుడప్పుడూ బాబాయి పిల్లలకు ఉప్పు చుట్టూ తిప్పి చేస్తూ వుంటుంది.

తనకు కూడా ఒకసారి అట్లాగే చేయబోతే తను కసురుకుంది కూడా. "ఛత్ నాకు అవన్నీ నచ్చవు." అనేటప్పటికి బామ్మ మొహం చిన్నబుచ్చుకుపోవటం గుర్తుకొచ్చింది.

ఆయనకు వొంట్లో బాలేకపోతే డాక్టర్ దగ్గరకు తీసుకెళ్ళాలి కాని ఈ దిష్టి తీయటం ఏం వైద్యం? అయినా పక్కింటి ఆయనకు నలతగా వుంటే ఆవిడకెందుకు అంత ఆరాటం?

ఆవిడ తన పని ముగించి అటువెళ్ళగానే పూర్ణిమ మెల్లిగా పిల్లిలాగ అడుగులో అడుగు వేసుకుంటూ వచ్చింది. "నాయనమ్మ వచ్చి హడావుడి చేసెళ్ళిందా?"

"పూర్ణిమా ఇటు రావే, నువ్వేనా నాయనమ్మకు చెప్పింది?" అంటూ నవ్వుతూ ఆమె చెవి పట్టుకున్నాడు శ్రీహరి.

"అబ్బా వదులు బాబాయి. మరి నువ్వేమో మాతో షటిల్ ఆడమంటే వంట్లో ఓపిక లేదంటూ ముసుగేస్తావా? అందుకే పనిష్మెంట్."

"ఏంటది తరుణి? నాయనమ్మ అంకుల్‌కు ఏం చేసింది?" ఆ పళ్ళెం గిన్నె చూసిన కుసుమ అడిగేసింది. తరుణి పూర్ణిమతో పాటు శ్రీహరి సుగుణ కూడా పెద్దగా నవ్వారు.

"ఏం లేదమ్మా, మీ అంకుల్ మీద అందరి కళ్ళు పడ్డాయని ఆవిడ దిష్టి తీసింది."

"అవును దిష్టి అంటే ఉప్పుతోకదా చేసేది. ఈ పళ్ళెం ఏంటి?"

"చిన్న చిన్న దిష్టి అయితే ఉప్పుతో. మరి మీ అంకుల్‌కు పే.....ద్ద దిష్టి కదా అందుకే ఇట్లా. అదేం లేదమ్మా, పళ్ళెంలో నిండా నీళ్ళు పోసి గిన్నెలోఒక కాయితమో బట్టముక్కో కాల్చి ఆ మంటతో చుట్టూ తిప్పుతుంది. ఆ మంటతో వున్న గిన్నెను నీళ్ళపళ్ళెంలో బోర్లిస్తుంది. ఆ నీళ్ళన్నీ సర్రుమని గిన్నెలోకి పోతాయి. అంతే ఆ నీళ్ళు పోగానే చెడు దిష్టి పోయిందని నాయనమ్మకు మహా తృప్తి."

"అదేంటి ఆంటీ? సైన్టిఫిక్ గా అది సామాన్యంగా జరుగుతుంది. మండేటప్పటికి ఆ గిన్నెలో వాక్యూం ఫార్మ్ అయి నీళ్ళు నేచురల్ గా అందులోకి పోతాయి. అది ఎప్పుడు చేసినా అట్లాగే జరుగుతుంది కదా!"

"కుసుమా, ఆ సంగతి మా అందరికి తెలుసు. కాని ఆ పెద్దావిడ నమ్మకం, సెంటిమెంట్ ఎందుకు కాదనాలి అని మీ అంకుల్ సరేనని చేయించుకుంటారు."

★★★★★

యాది ఎవరు? నరసి ఎవరు?

ఈ రెండు కుటుంబాలు ఒకటిగా మసలటం ఏమిటి?

బొంబాయిలో పుట్టి పెరిగి అమ్మ నాన్న తప్ప వేరే ప్రపంచం తెలియని తనకు బయట కూడా ఇన్ని అనుబంధాలు ఆప్యాయతలు

వుంటాయని ఇప్పుడిప్పుడే తెలుస్తున్నది. అనేక ప్రశ్నలు వుదయిస్తున్నాయి.

మెల్లిమెల్లిగా తనలోనే లోపం వున్నదని అర్థమవుతున్నది.

ఏమిటో తెలియని బాధ. దుఃఖం ముంచెత్తుతున్నాయి. ఎందుకో వెంటనే బామ్మను తాతగారిని చూడాలన్న ఆరాటం మొదలయింది. తమ్ముళ్ళు చెల్లెళ్ళతో ఆడుకోవాలని అనిపిస్తున్నది. పిన్ని దగ్గర కూర్చొని వళ్ళో తలపెట్టుకొని పడుకోవాలని అనిపిస్తున్నది.

మహర్నవమి నాడు "కుసుమా! కొత్తబట్టలు కట్టుకొని పద అందరికి దండం పెట్టి వద్దాము."

ముందు రోజు తరుణి షాపింగ్ కెళ్ళి తనకు తెచ్చుకుంటూ కుసుమకు కూడా కొత్త బట్టలు తెచ్చింది.

మొహమాటపడుతూనే ఆ బట్టలు కట్టుకొని ఇంట్లో వున్న పెద్దవాళ్ళకు తరుణితో పాటు తను కూడా నమస్కారం చేసింది.

"పద పద. నాయనమ్మ బాబాయిల వద్ద కూడా ఆశీర్వాదం తీసుకొని వద్దాం. ఆలస్యమైతే నాయనమ్మ కోప్పడుతుంది." కుసుమ చేయి పట్టుకొని పక్కింటికి పరుగు తీసింది.

కుసుమకు అర్థం కాలేదు. ఇంట్లో అమ్మ నాన్న దగ్గర ఆశీర్వాదం తీసుకున్నారు. పక్కింట్లో నాయనమ్మ కోప్పడుతుందని భయపడటం ఏమిటి?

మళ్ళీ అనుబంధాల ప్రశ్న.

"ఏమే తరుణీ మళ్ళీ ఆలస్యం చేసావా? కుసుమ వచ్చిందా లేదా? పిల్లలూ అందరూ కొత్త బట్టలు కట్టుకొని మీ మీ పుస్తకాలు తీసుకొని రండర్రా. ఈ రోజు అందరూ కూర్చొని సరస్వతి పూజ చేయాలి."

"తరుణీ, అమ్మకు మళ్ళీ జ్ఞాపకం చేయవే. గారెలు పులిహోర చేస్తానన్నది. పన్నెండింటికల్లా నైవేద్యం పెట్టి తీసుకొని రమ్మను. తతిమ్మా వంటలన్నీ ఇక్కడే.

అబ్బాయిలూ! భోజనాలకి ముందర మగవాళ్ళు పిల్లలు ఒకే బంతిలో కూర్చోవాలి. ఆనిక్కి ఆకలి లేదు తరువాత తింటా అంటే బెత్తం పుచ్చుకుంటాను. జాగ్రత్త." అంటూ నాయనమ్మ ఎవరి పనులు వాళ్ళకు అప్పచెప్పి పిల్లలను కూర్చోబెట్టి వైనంగా సరస్వతి పూజ చేయించింది.

నిన్న కనిపించిన జానకమ్మ రూపానికి ఈ రోజున కనిపిస్తున్న దానికి ఎంత తేడా? ఒకే స్త్రీకి ఇన్ని రూపాలా!

"ఏమే యాదీ నరసి. మీరు కూడా రండే. బాగా చదువు రావాలి అని చల్లని తల్లికి మొక్కుకోండి."

"తరుణి నీ స్నేహితురాలు రేణుకను కూడా భోజనానికి రమ్మని చెప్పమన్నాను చెప్పావా? ఇంకా రాలేదే" పండగ హడావుడి అంతా ఆ పెద్దావిడదే.

తరుణి తల్లి సుగుణ పూర్ణిమ తల్లి సీత తో పాటు సుందరం బాబాయి భార్య సునంద రాజు బాబాయి భార్య సుధ వడ్డనలు చేస్తుంటే మగవాళ్ళు, పిల్లలు, నాయనమ్మ భోజనాలకు కూర్చున్నారు.

ఆ భోజనాల ఘట్టం కూడా తినే పదార్థాలకన్నా మధురంగా సాగింది.

పూర్ణిమ తరుణితో పాటు కుసుమ కూడా ఆకులు పెట్టటం గ్లాసులు పెట్టి మంచినీళ్ళు పోయటం వంటి పనులు చేయటంలో సాయపడింది. మాటలలోనే రేణుక కూడా వచ్చింది.

సుధ పిన్ని మొహమాటస్తురాలే కాని సునంద పిన్ని మంచి మాటకారి. పిల్లలతో పిల్లగా పెద్దలతో పెద్దగా మసులుకుంటూ వుంటుంది. డిగ్రీ వరకు చదువుకుంది. పనులలో కూడా చకచక సాయం చేస్తూ గలగల కబుర్లు చెప్పుతూ అందరి మన్ననలను అందుకుంది.

"అమ్మాయిలూ! మీరు నలుగురు కూడా ఒకసారి వడ్డనలు చేసి కూర్చోండే. మీ అమ్మ పిన్నివాళ్ళు మిగతా వడ్డన చూసుకుంటారు."

"సునందా! మళ్ళొకసారి ఆ బొబ్బట్ల పళ్ళెం అందుకొని మారు అడగవే."

"వీటిని భక్ష్యాలు అంటారుగా, బొబ్బట్టేమిటి?" కుసుమ అడిగింది.

సునంద నవ్వుతూ అంది. "మళ్ళీ మన భాషాశాస్త్రం మాండలికాలు మొదలయ్యాయా? మేము బొబ్బట్టు అనేది మీరు భక్ష్యాలు అంటారు కదా! ఏం రేణుక మీరు వీటిని పోళీలు అంటారు కదా? అనంతపురం లో ఓళిగలు అని కూడా అంటారనుకుంటా."

"అవును పిన్నీ మా వూళ్ళో వీటిని పోళీలు ఓళిగలు అని కూడా అంటారు."

"ఒక్కొక్క ప్రాంతంలో ఒక్కొక్క పేరు. అట్లాగే తినే పద్దతి కూడా వేరే. మేమేమో వీటిమీద కరిగించిన నెయ్యి వేసుకొని తింటాము. కర్నూలు వైపు వారేమో పాలు పోసుకుంటారు కదా!"

"మా వైపు పోళీలు పల్చగా పెద్దపెద్దగా పెనమంత సైజులో చేస్తారు. వడ్డించేటప్పుడు తలా ఒక గ్లాసులో వేడివేడి పాలు కూడా పెడుతారు. ఆ పాలు పోసుకొని అంతా ముద్దగ చేసుకొని తింటారు."

అందరూ ఆశ్చర్యంగ వింటున్నారు. బొబ్బట్లు పాలు కాంబినేషన్ ఏమిటా అని.

వాళ్ళ మాటలలో శ్రీహరి కూడా మాట కలిపాడు. "ఈ కాంబినేషన్లకే మీరు విస్తుపోతున్నారు. మల్లాది రామకృష్ణశాస్త్రిగారు రాసిన కృష్ణాతీరం అన్న నవలలో అన్నప్పగారు అనే పాత్ర చెప్పిన మాటలు చదివితే మీరంతా దిమ్మతిరిగిపోతారు. "బచ్చలికూరలో నాలుగువెల్లుల్లి రెబ్బలు వేసి దిమ్మ తిరిగేటట్టు తిరగబోతెడితే బొబ్బట్లలోకి నంజుకునేందుకు మాంచి వనరుట ఆహా!" అంటూ పెద్దగా నవ్వేటప్పటికి అందరూ ఆయనతో పాటు నవ్వటం మొదలెట్టారు.

"బొబ్బట్లలోకి వెల్లుల్లి వేసిన బచ్చలికూరేమిట్రా పిచ్చి సన్నాసీ" అంటూ జానకమ్మ కూడా నవ్వటం మొదలెట్టింది.

అట్లా కొత్త కొత్త రుచులు విభిన్న ప్రాంతాల వంటకాల గురించి సరదాగా కబుర్లు చెప్పుకుంటూ తింటూ వున్నారు.

"ఏమ్మా సునందా మీ వాళ్ళు తెచ్చిన స్పెషల్ మాకు వడ్డించలేదే. అన్ని నీ కోసమే దాచుకున్నావా?" తరుణి పెద్ద బాబాయి ఆనంద్ అడిగాడు.

"అయ్యో చిన్నబావగారూ ఇదిగో తెస్తునే వున్నాను. ఇంతలో మీరు అడగనే అడిగారు." అంటూ వడ్డించటం మొదలెట్టింది.

"మై గాడ్ ఇవేమిటి పిన్ని పేపర్ చుట్టచుట్టి వడ్డిస్తున్నావు? ఇవేం చేయాలి? ఈ పేపర్ రోల్ లోపల వుంటుందా స్వీట్?" ఆశ్చర్యంగా అడిగిన కుసుమను చూసి అందరూ నవ్వేరు.

"వీటిని పూతరేకులు అంటారు. అబ్బో ఇవి తయారు చేయాలంటే చాల అనుభవం కావాలి. ఇవి ఇళ్ళల్లో చేయటం అంత సులభం కాదు. అందుకే పెద్దపెద్ద మొత్తాలలో చేస్తూ వుంటారు."

"నిజంగానే చాల టేస్టీగా వున్నాయి." రేణుక కూడా అంది.

"మీ ఫ్రెండ్షిప్ లాగా కదా. ఈ స్వీట్ వున్నంత తీయగా మీ ఫ్రెండ్షిప్ కలకాలం వుండాలి."

"అవునండి. ఒక విచిత్రం చూసారా.  పూర్ణిమ తరుణి రేణుక కుసుమ. వీళ్ళ నలుగురి పేర్ల మొదటి అక్షరాలు కలిపి చూడండి." చిలిపిగా నవ్వుతూ అంది సునంద.

పెద్దవాళ్ళు ఈ కుర్రకారు సంభాషణ వినోదంగా వింటున్నారు.

"అవునోయ్ పూ.త.రే.కు. వావ్ వాటె బ్రిలియంట్ బుర్రోయి నీది."

"పిన్నీ మన ఇంటికి ఎప్పుడూ రాలేదు కాని లూసీ అని మాకు ఇంకో ఫ్రెండ్ కూడా వున్నదని చెప్తూతూంటానే, దాన్ని కూడా కలుపుకుంటే పూతరేకులు. ఇకటి కాదు ఎన్నో."

"అయితే వీళ్ళను అందరిని ఒకేసారి పిలవ వలసి వస్తే ఒక్కొక్కరి పేరు పిలవకుండా ఏయ్ 'పూతరేకులూ' అంటే సరి పోతుందేమో."

"చాల్లేవే నీ చమత్కారపు మాటలు నువ్వూనూ, నేర్చిపోయావు. పిల్లలతో కలిసి పోచికోలు కబుర్లతో కడుపు నింపుకుంటారా ఏమిటి? అందరికి పెరుగు వడ్డించి మీరు కూడా పెట్టుకోండి. బాగా ఆలస్యమయిపోతోంది." సునంద వంక మురిపెంగా చూస్తూ, తతిమ్మా ఆడవాళ్ళనుద్దేశించి ఆదేశించింది జానకమ్మ

*(కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments